క్లుప్తంగా

అంజన్నకు ప్రత్యేక పూజలు

ఆత్మకూరు: పట్టణంలోని అభయాంజనేయస్వామికి శనివారం అమావాస్య సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి స్వామివారికి కుంకుమార్చన, 13 రకాల నక్షత్ర హారతుల కార్యక్రమం చేపట్టారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు.

అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ



అంగన్‌వాడీ పిల్లలతో మాట్లాడుతున్న ఎంఈఓ సుభాన్

పగిద్యాల: మండలంలోని తూర్పు నెహ్రూనగర్ గుండు తూము పాఠశాల వద్ద ఏర్పాటు చేసిన అంగన్‌వాడీ కేంద్రాన్ని మండల విద్యాధికారి సుభాన్ శనివారం తనిఖీ చేశారు. మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలని అంగన్‌వాడీ కార్యకర్త నారాయణమ్మకు సూచించారు. రక్తహీనతతో బాధ పడుతున్న పిల్లల పట్ల శ్రద్ధ వహించాలన్నారు. గర్భిణులు, బాలింతల బరువు, ఎత్తు నమోదులో నిర్లక్ష్యం చేయరాదన్నారు. ప్రభుత్వం వారికి సరఫరా చేసే టేక్ హోమ్ రేషన్ కింద నెల నెలా పంపిణీ చేసే పాలు, కోడిగుడ్లు, బియ్యం, బ్యాళ్లు, చిక్కీలు, రాగి పిండి ఫేషియల్ యాప్ ద్వారా నమోదు చేసి అందజేయాలన్నారు.

ఎలక్ట్రానిక్ గాడ్జెట్లతో దృష్టి లోపాలు



విద్యార్థులకు కంటి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

మహానంది: టెక్నాలజీ పేరుతో మొబైల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ గాడ్జెట్లు వచ్చిన తర్వాత దృష్టి లోపాలు అధికమవుతున్నాయని జిల్లా అంధత్వ నివారణ సంస్థ వైద్యాధికారి జి.కృష్ణమోహన్‌రెడ్డి తెలిపారు. తిమ్మాపురంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో శనివారం విద్యార్థులకు కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. 41 మందికి దృష్టిలోపం ఉన్నట్లు గుర్తించామన్నారు. ఎలక్ట్రానిక్ పరికరాలను ఎక్కువ కాంతితో వీక్షించడం, పోషకాహార లోపాల వల్ల దృష్టిలోపం అధికమవుతుందన్నారు. దృష్టిలోపం ఉన్నవారికి కంటి అద్దాలను పంపిణీ చేస్తామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు చంద్రశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

సారా విక్రయిస్తే కేసులు నమోదు



నాటుసారా చూపుతున్న ఎక్సైజ్ సీఐ, ఎస్‌ఐ, పోలీసులు

నందికొట్కూరు: నాటుసారా విక్రయిస్తే కేసులు నమోదు చేస్తామని ఎక్సైజ్ సీఐ రామాంజనేయులు నాయక్ హెచ్చరించారు. శనివారం పట్టణంలోని నీలిషికారిపేటలో దాడులు నిర్వహించారు. 250 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. షికారి మాలటిని అరెస్టు చేసి 30 లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకున్నారు. ఆమె భర్త షికారి రాజుపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. దాడుల్లో ఎస్‌ఐ జప్రుల్లా, శ్రీనివాసులు, హెడ్ కానిస్టేబుల్ కుమారి, కానిస్టేబుళ్లు శివన్న, మధుప్రసాద్ ఉన్నారు.

విద్యుత్ భారాలకు వ్యతిరేకంగా 28న ప్రతిజ్ఞ దినం



మాట్లాడుతున్న సీపీఎం పట్టణ కార్యదర్శి ఎ.రణధీర్

ఆత్మకూరు: విద్యుత్ భారాలకు వ్యతిరేకంగా ఈనెల 28న ప్రతిజ్ఞ దినంగా పాటిద్దామని సీపీఎం పట్టణ కార్యదర్శి ఎ.రణధీర్ అన్నారు. శనివారం డాక్టర్ ఎ.ధనుంజయ మీటింగ్ హాల్‌లో ఏర్పాటు చేసిన పార్టీ పట్టణ కమిటీ సమావేశంలో ఎ.రణధీర్ మాట్లాడుతూ ప్రభుత్వం మీటర్లు అమర్చి ప్రజలపై విద్యుత్ భారం మోపుతోందన్నారు. విద్యుత్ భారాలకు వ్యతిరేకంగా విద్యుత్ పోరాట వేదిక ఆధ్వర్యంలో సాగుతున్న ఆందోళనకు తమ పార్టీ సంపూర్ణ మద్దతు తెలుపుతుందన్నారు. సమావేశంలో పార్టీ పట్టణ కమిటీ నాయకులు డి.రామ్‌నాయక్, ఎస్.మంజుల, మీనాక్షమ్మ, సురేంద్ర, షేక్‌ఇస్మాయిల్, నాగేశ్వరరావు, సద్దాంహుసేన్, పాతకోట భాస్కర్ పాల్గొన్నారు.

అభివృద్ధి వైపు అడుగులు

- విజయదుర్గా చెంచుకాలనీ–2ని సందర్శించిన ఐటీడీఏ పీఓ
- మౌలిక సదుపాయాలు, పక్కా ఇళ్ల నిర్మాణానికి ప్రణాళికలు
- స్వయం ఉపాధి కల్పించేందుకు ఏర్పాట్లు



చెంచులతో సమావేశమైన ఐటీడీఏ పీఓ శివప్రసాద్

సాక్షి ఎఫెక్ట్



చెంచు కాలనీలో పర్యటిస్తున్న ఐటీడీఏ అధికారులు

వెలుగోడు: పట్టణ శివారులోని విజయదుర్గా చెంచు కాలనీ–2 అభివద్ధికి దూరంగా ఉందంటూ ఈనెల 18న సాక్షి పత్రికలో ప్రచురితమైన కథనానికి ఐటీడీఏ అధికారులు కదిలివచ్చారు. చెంచులను అన్నివిధాలా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. మౌలిక వసతులు కల్పిస్తామని, పక్కా ఇల్లు నిర్మిస్తామని, ఉపాధి కల్పిస్తామని భరోసా కల్పించారు. స్థానిక ఎస్ఎన్ఎస్ఆర్ డిగ్రీ కాలేజీ వెనుక భాగంలో నివసిస్తున్న 60 చెంచు కుటుంబాలు దుర్భర జీవితాలు గడుపుతున్నారన్న కథనానికి అధికారుల్లో చలనం వచ్చింది. శనివారం పట్టణంలోని చింతల కుంట కాలనీ(విజయదుర్గా చెంచు కాలనీ–2)ని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి శివప్రసాద్ సందర్శించారు. కాలనీవాసులతో సమావేశమై వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఆధార్ కార్డు లేనివారికి డొమైన్ ధ్రువీకరణ పత్రం (నివాస ధ్రువీకరణ పత్రం), రేషన్ కార్డు లేని వారికి రేషన్ కార్డులు ఇప్పిస్తామని పీఓ తెలిపారు. కాలనీలో మూడు లైన్ల వీధి లైట్లు ఏర్పాటు చేస్తామని, ఇల్లు లేని వారికి పక్కా గృహాలు మంజూరుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను పీఓ ఆదేశించారు. 45 మంది చెంచు కుటుంబాలకు పి.యం జన్ మన్ కింద పక్కా ఇల్లు మంజూరుకు సర్వే చేయాలని సూచించారు. స్వయం ఉపాధి పథకంలో భాగంగా అగర్ బత్తి, బిస్కట్, కుట్టు మిషన్లు మంజూరు చేస్తామని, వీటి ద్వారా ఉపాధి పొందాలని సూచించారు. ఎవరూ భిక్షాటన చేయకుండా స్వయం ఉపాధి ద్వారా ఆర్థికాభివృద్ధి సాధించాలని చెంచులకు పీఓ సలహా ఇచ్చారు. కార్యక్రమంలో ఐటీడీఏ ప్రాజెక్టు మేనేజర్ నాయక్, వెలుగు ఏపీడీ నాయక్, ఎంపీడీఓ మధుసూదన్‌రెడ్డి, తహసీల్దారు శ్రీనివాసగౌడు, వెలుగోడు సర్పంచు వేల్పుల జయపాల్, పంచాయతీ కార్యదర్శి నాగేంద్ర పాల్గొన్నారు.

మహానందిలో వీకెండ్ సందడి

మహానంది: మహానందిలో శనివారం వీకెండ్ సందడి నెలకొంది. శ్రావణమాసం ముగియనుండటం, అమావాస్య కావడంతో పలు ప్రాంతాల నుంచి భక్తులు క్షేత్రానికి చేరుకుని స్థానిక కోనేరుల్లో పుణ్యస్నానాలు ఆచరించి కామేశ్వరీదేవి, మహానందీశ్వర స్వామి వార్లతో పాటు కోదండరామాలయం, వినాయకనంది, గరుడనంది ఆలయాలను సందర్శించి భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. అనంతరం నంది సర్కిల్, పెద్దనంది విగ్రహాలను తిలకించారు.

మహానందీశుడి దంపతులకు కల్యాణం

మహానందిలో కొలువైన గంగ, కామేశ్వరీదేవి మహానందీశ్వరస్వామి దంపతుల ఉదయం స్థానిక అలంకార మండపంలో కల్యాణం నిర్వహించారు. వేదపండితులు, అర్చకులు స్వామి, అమ్మవారి ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి గణపతిపూజ, పుణ్యాహవాచనం, అలంకార పూజలు, అక్షింతల సమర్పణ, మాంగల్య ధారణ పూజలును వేదోక్తంగా చేపట్టారు. భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు.

ఆలయ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుదాం

ఆలయ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుదామని ఈఓ నల్లకాలువ శ్రీనివాసరెడ్డి అన్నారు. శనివారం క్షేత్ర ప్రాంగణంలో స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఆలయ పరిసరాల్లో పిచ్చి మొక్కలను తొలగించారు.

శ్రీశైలంలో హుండీ దొంగతనంపై హైకోర్టులో పిటిషన్

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానంలోని మల్లికార్జున స్వామివారి గర్భాలయంలో జూలై 16న చోటుచేసుకున్న హుండీ దొంగతనంపై సమగ్ర విచారణ జరపాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అరవింద్‌రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం అరవింద్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ స్వామివారి ఆలయంలో హుండీ చోరీ ఘటనలో సంబంధం లేని వారిని దేవస్థాన ఈఓ సస్పెండ్ చేశారన్నారు. ప్రధాన అర్చకుడి వద్ద ఉండాల్సిన తాళాలు ఒక పరిచారకుడికి ఎలా వచ్చాయని అరవింద్‌రెడ్డి ప్రశ్నించారు. దొంగతనం జరిగిన సీసీ పుటేజ్‌ను ఎందుకు బహిర్గతం చేయలేదని ప్రశ్నించారు. ఈ విషయంపై పూర్తి విచారణ జరపాలని హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసినట్లు అరవింద్‌రెడ్డి తెలిపారు.

శ్రీశైల దేవస్థానంలో అంతర్గత బదిలీలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానంలో పలువురు రెగ్యులర్ ఉద్యోగులను అంతర్గత బదిలీలు చేస్తూ శ్రీశైల దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎం.శ్రీనివాసరావు ఉత్తర్వులు జారీ చేశారు. శనివారం దేవస్థానంలో పనిచేసే 22 మంది ఉద్యోగులను అంతర్గత బదిలీలు చేశారు. పర్యవేక్షకులు ఎం.రవికుమార్‌ను స్వామివారి ఆలయ మొదటి షిఫ్ట్, హరికృష్ణారెడ్డిని స్వామివారి ఆలయ రెండవ షిఫ్టుకు, హర్యానాయక్‌కు వసతి, ప్రొటోకాల్ వింగ్‌కు, జి.రవిని అమ్మవారి ఆలయ పర్యవేక్షకులుగా, కె.శివప్రసాద్‌ను డొనేషన్ కౌంటర్, కె.గిరిజామణికి ఇంజినీరింగ్ విభాగం, ఏఈ వి.శివారెడ్డికి ఇంజినీరింగ్ స్టోర్‌కు, జూనియర్ అసిస్టెంట్ కె.సురేష్‌రెడ్డిని స్వామివారి ఆలయ మొదటి షిఫ్టుకు, స్వామివారి ఆలయంలో విధులు నిర్వహిస్తున్న సుబ్బరాయుడును అమ్మవారి ఆలయానికి అంతర్గత బదిలీలు చేశారు. ఇంకా పలువురు ఏఈలు, సీనియర్ అసిస్టెంట్‌లు, జూనియర్ అసిస్టెంట్లు, రికార్డు అసిస్టెంట్లు, వర్క్ ఇన్‌స్పెక్టర్‌లను మొత్తం 22 మందిని అంతర్గత బదిలీలు చేశారు.

వేరుశనగ పొట్టుకు నిప్పు

మహానంది: బొల్లవరం గ్రామానికి చెందిన తురగ వెంకటరాముడుకు చెందిన వేరుశనగ పొట్టుకు శుక్రవారం అర్ధరాత్రి గుర్తు తెలియని దుండగులు నిప్పు పెట్టారు. బాధితుడు తెలిపిన వివరాలు.. ఇటీవల జీవనోపాధి నిమిత్తం 40 పొట్లేళ్లను కొనుగోలు చేశానన్నారు. వాటి కోసం మూడు ట్రాక్టర్ల వేరుశనగ పొట్టును ఇంటి ముందు ఉన్న రేకులషెడ్డులో నిల్వ చేసుకున్నట్లు చెప్పారు. గుర్తు తెలియని దుండగులు నిప్పు పెట్టడంతో కాలిపోయిందని, రూ.లక్షకు పైగా నష్టం వాటిల్లిందని బాధితుడు వాపోయాడు.

విద్యుత్‌ను అక్రమంగా ఉపయోగిస్తే క్రిమినల్ కేసులు నమోదు



విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను ప్రారంభించిన జిల్లా అధికారులు

కొత్తపల్లి: విద్యుత్ కనెక్షన్ తీసుకోకుండా అక్రమంగా విద్యుత్ వాడుకుంటే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని జిల్లా విద్యుత్ శాఖ ఎస్ఈ సుధాకర్ హెచ్చరించారు. శనివారం మండలంలోని గోకవరం గ్రామ శివారులో ఉన్న విద్యుత్ సబ్ స్టేషన్‌లో 8 మెగా వాట్ల పవర్ టాన్స్‌ఫార్మర్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 8 మెగా వాట్ల విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల ద్వారా రైతులకు నాణ్యమైన విద్యుత్‌ను అందిస్తామన్నారు. విద్యుత్ సిబ్బంది వినియోగదారులకు అందుబాటులో ఉంటూ విద్యుత్ సమస్య తలెత్తకుండా చూడాలన్నారు. విద్యుత్ సరఫరా నిలిచిపోయిందని వినియోగదారులు ఫోన్లు చేసినప్పుడు సానుకూలంగా స్పందించి ఎప్పుడు వస్తుందో సమాచారం ఇవ్వాలన్నారు. వ్యవసాయానికి ఇప్పటి వరకు పగలు, రాత్రి కలిపి 9 గంటల కరెంట్ ఇచ్చేవాళ్లమని 8 మెగావాట్ల ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటుతో ఇకపై పగలే 9 గంటల కరెంటు అందిస్తామన్నారు. కార్యక్రమంలో ఎంఆర్‌టీ డీఈ శ్రీరాములు, ఆత్మకూరు ఈఈ జయశంకర్, ఎం ఆర్ టి డీఈఈ గురులింగాచారి, ఆత్మకూరు డీఈఈ రామసుబ్రహ్మణ్యం, కొత్తపల్లి ఏఈ అబీద్ పాల్గొన్నారు.

మహిళల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

నందికొట్కూరు: మహిళల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే జయసూర్య అన్నారు. శనివారం పట్టణంలోని ఎన్.ఎస్ ఫంక్షన్ హాల్‌లో జరిగిన నారి శక్తి కార్యక్రమంలో పొదుపు మహిళలు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదరిక నిర్మూలన కోసం ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. స్వయం సహాయక సంఘాలను బలోపేతమన్నారు. మహిళా సాధికారత, మహిళా స్వావలంబన దృష్టిలో ఉంచుకుని సీఎం సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. అనంతరం పొదుపు మహిళకు బ్యాంక్ రుణాల చెక్‌ను ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మాండ్ర శివానందరెడ్డి, మురళి, ముర్తుజావలి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై సమీక్ష

బండి ఆత్మకూరు: గ్రామాల్లో మురుగు నీరు నిల్వ లేకుండా చర్యలు చేపట్టాలని ఎంపీపీ దేరెడ్డి చిన్న సంజీవరెడ్డి అధికారులను ఆదేశించారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో పలు సమస్యలపై శనివారం ఆయన అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రహదారులపై నీరు నిల్వ ఉండకుండా మురుగు కాలువలను శుభ్రం చేయించాలన్నారు. సమావేశంలో ఎంపీడీఓ రామకృష్ణవేణి, ఏపీఓ వసుధ, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

సొంత భవనం లేక వ్యవసాయ సిబ్బంది పాట్లు



శిథిలమైన భవనంలో నిర్వహిస్తున్న వ్యవసాయ కార్యాలయం



వర్షానికి తడవకుండా కప్పిపెట్టిన రికార్డులు

జూపాడుబంగ్లా: మండల వ్యవస్థ ఏర్పడి 40 ఏళ్లు గడిచినా ఇప్పటి దాకా జూపాడుబంగ్లా వ్యవసాయ కార్యాలయానికి భవనం లేకపోవటంతో కార్యాలయ ఏఓ, సిబ్బంది, రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. వ్యవసాయ కార్యాలయానికి ఇప్పటి దాకా సొంత భవనం లేకపోవటంతో 25 ఏళ్లపాటు అద్దె భవనంలో నిర్వహించారు. అద్దె భారం అధికం కావటంతో కార్యాలయాన్ని శిథిలమైన తంగడంచ ఫారం భవనాల్లోకి మార్చారు. ప్రస్తుతం మండల వ్యవసాయ కార్యాలయాన్ని కేజీ రోడ్డు పక్కన శిథిలమైన తంగడంచ ఫారం భవనంలో నిర్వహిస్తున్నారు. భవనం ఇరుకుగా ఉండటంతో వ్యవసాయ సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేసుకునేందుకు, అధికారులు, సిబ్బంది కూర్చొనేందుకు స్థలం లేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. దీనికితోడు చిన్నపాటి వర్షం కురిసినా భవనం వెలుస్తుండటంతో కార్యాలయ కంప్యూటర్లు, రికార్డులను భద్రపర్చుకొనేందుకు అధికారులు సతమతం అవుతున్నారు. జగనన్న పాలనలో నిర్మించిన రైతుభరోసా కేంద్రాల్లోనైనా కార్యాలయం ఏర్పాటుచేసుకొందామంటే అవి పూర్తైనా ఇప్పటిదాకా ప్రారంభానికి నోచుకోలేదు. జిల్లా కలెక్టర్, ప్రజాప్రతినిధులు చర్యలు తీసుకుని జూపాడు బంగ్లా మండల వ్యవసాయ కార్యాలయానికి నూతన భవనం నిర్మించాలని రైతులు, వ్యవసాయ అధికారులు, సిబ్బంది కోరుతున్నారు.

పోగొట్టుకున్న ఫోన్ చేతికొచ్చింది

- 53 మంది బాధితులకు ఫోన్లు అప్పగింత

ఆళ్లగడ్డ: ఎంతో ఇష్టపడి కొన్న ఫోను పోతే అయోమయంలో పడతారు. ఆన్‌లైన్ బ్యాంక్ లావాదేవీలు, వ్యక్తిగత సమాచారం అపరిచితుల చేతికి చేరుతుందనే ఆందోళనకు గురవుతుంటారు. కొంత మంది పాత ఫోనే కదా అని తేలికగా తీసుకుంటున్నారు. స్టేషన్‌కెళ్లినా ఫిర్యాదు తీసుకోవట్లేదనే అభిప్రాయంతో మరికొందరు మౌనం వహిస్తున్నారు. నిత్యం వందల సంఖ్యలో ఫోన్లు పోతున్నాయి. బాధితులు సకాలంలో ఫిర్యాదు చేయడంతో కొన్నింటిని పోలీసులు రికవరీ చేసి బాధితులకు అప్పగిస్తున్నారు. ఆళ్లగడ్డ సబ్ డివిజన్ పరిధిలో వివిధ కారణాలతో సెల్‌ఫోన్లు పోగొట్టుకున్న బాధితులకు పోలీసులు అండగా నిలిచి వాటిని తిరిగి బాధితులకు అందించేలా ప్రత్యేక చొరవ చూపారు. స్థానిక డీఎస్పీ కార్యాలయంలో శనివారం డీఎస్పీ ప్రమోద్ ఫోన్ పోగొట్టుకున్న 52 మంది యజమానులకు రికవరీ చేసిన మొబైళ్లను అందజేశారు. వీటి రికవరీలో ప్రతిభ చూపిన ఐటీ కోర్, సీసీఎస్ సిబ్బందిని అభినందించారు. కాగా సెల్‌ఫోన్ పోగొట్టుకున్న బాధితులు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మొబైల్ మిస్సింగ్ పోర్టల్ సీఈఐఆర్‌లో వివరాలు నమోదు చేయాలని డీఎస్పీ సూచించారు. వాట్సాప్ నంబర్ 91211 01107 హాయ్ అని టైప్ చేసి ఏకేపీ మొబైల్ ట్రాకర్.ఇన్ లింక్ నొక్కడం ద్వారా ఫిర్యాదులను స్వీకరిస్తామన్నారు. ఎఫ్ఐఆర్ కట్టకుండా పోలీస్ స్టేషన్‌కు వెళ్లకుండా సులభంగా పోగొట్టుకున్న మొబైల్ కనుగొని బాధితులకు త్వరగా అందజేసేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు డీఎస్పీ తెలిపారు.

స్వచ్ఛ ఓటర్ల జాబితా రూపకల్పనకు సహకరించండి



రాజకీయ పార్టీ ప్రతినిధులతో మాట్లాడుతున్న డీఆర్‌ఓ రాము నాయక్

నంద్యాల: స్వచ్ఛమైన ఓటర్ల జాబితాను రూపొందించేందుకు రాజకీయ పార్టీ ప్రతినిధులు సహకరించాలి జిల్లా రెవెన్యూ అధికారి రాము నాయక్ కోరారు. శనివారం జిల్లా రెవెన్యూ అధికారి ఛాంబర్‌లో ఓటర్ల జాబితా రూపకల్పనపై గుర్తింపు పొందిన రాజకీయ పార్టీ ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. డీఆర్ఓ మాట్లాడుతూ తప్పులు లేని, ఓటర్ల మార్పులు, చేర్పులు, బూతు స్థాయి ఏజెంట్లతో పరిశీలించుకుని అభ్యంతరాలు ఉంటే ఈఆర్‌ఓ, ఏఆర్‌ఓలకు తెలియజేయాలన్నారు. రాజకీయ పార్టీ ప్రతినిధులు సూచించిన అంశాలను ఎన్నికల సంఘానికి నివేదిస్తామన్నారు. ఆయా పార్టీల ప్రతినిధులు మాట్లాడుతూ నంద్యాల నియోజకవర్గం పాండురంగాపురం గ్రామానికి ప్రత్యేక పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. టీడీపీ ప్రతినిధి ప్రసాద్ రెడ్డి, శివరామిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ ప్రతినిధి సయ్యద్ రియాజ్ బాషా, సీపీఐ పార్టీ ప్రతినిధి పి.నరసింహులు పాల్గొన్నారు.

వేడుకలను ప్రశాంతంగా నిర్వహించుకోండి



గణేష్ ఉత్సవ కమిటీ నిర్వాహకులతో మాట్లాడుతున్న శ్రీశైలం సీఐ జి.ప్రసాదరావు

శ్రీశైలంటెంపుల్: వినాయక చవితి వేడుకలను ప్రశాంతంగా నిర్వహించుకోవాలని శ్రీశైలం సీఐ జి.ప్రసాదరావు సూచించారు. శనివారం స్థానిక మల్లికార్జున కల్యాణ మండపంలో గణేష్ ఉత్సవ కమిటీ నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ గణేష్ మండపాల ఏర్పాటు సమయాల్లో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. విగ్రహాల ఏర్పాటుకు అనుమతులు తీసుకోవాలన్నారు.

- మహానంది: మండల పరిధిలోని అన్ని గ్రామాల్లోని గణేష్ ఉత్సవ కమిటీ ప్రతినిధులతో శనివారం పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ రామ్మోహన్‌రెడ్డి సమావేశమయ్యారు. ఉత్సవాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా చర్యలు తీసుకోవాలని వారికి ఆయన సూచించారు. నిమజ్జనం సందర్భంగా మద్యం తాగడం, వ్యక్తిగత గొడవలకు దిగడం లాంటివి చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామాల్లో విగ్రహాలను నెలకొల్పేవారు అనుమతి తీసుకోవాలన్నారు.
- నందికొట్కూరు: కులమతాలకు అతీతంగా వినాయకచవితి పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలని మిడుతూరు ఎస్ఐ ఓబులేసు సూచించారు. శనివారం పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన శాంతి కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. విగ్రహాల ఏర్పాటుకు వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. గణేష్ నిమజ్జనం చేసే తేదీలు, సమయం, ఏ వాహనంలో విగ్రహాన్ని తీసుకెళ్తారో వివరాలు నమోదు చేయాలన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం



పగిద్యాలలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, అధికారులు,



వర్షాకాల పరిస్థితులపై విద్యార్థులకు సూచిస్తున్న అధికారులు



దుద్యాలలో మానవహారం నిర్వహిస్తున్న దృశ్యం

వెలుగోడు: సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మండల ప్రత్యేక అధికారి హీరా నాయక్ సూచించారు. స్వచ్ఛ ఆంధ్ర – స్వర్ణ ఆంధ్రలో భాగంగా శనివారం వెలుగోడులో అవగాహన ర్యాలీ నిర్వహించారు. పరిసరాల పరిశుభ్రత, చేతుల శుభ్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మధుసూదన్ రెడ్డి, తహసీల్దార్ శ్రీనివాసులు, సర్పంచ్ జయపాల్ పాల్గొన్నారు.

- పగిద్యాల: స్వచ్ఛ ఆంధ్ర – స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా శనివారం డిప్యూటీ ఎంపీడీఓ అబ్దుల్ రహీం ఆధ్వర్యంలో స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపీడీఓ కార్యాలయం నుంచి బస్టాండు వరకు ర్యాలీ నిర్వహించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని విద్యార్థులు నినాదాలు చేశారు. అనంతరం బస్టాండులో మానవహారంగా ఏర్పడి ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కార్యాలయ ఏఓ నాగేంద్రకుమార్, ఏపీఓ మద్దిలేటి, ఏపీఎం చంద్రకళ పాల్గొన్నారు.
- పాములపాడు: సీజనల్ వ్యాధుల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీవో చంద్రశేఖర్ అన్నారు. శనివారం స్థానిక ఏపీ మోడల్ స్కూల్లో స్వర్ణాంధ్ర స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాలు కురుస్తున్నందున వాతావరణం మార్పుల వల్ల సీజనల్ వ్యాధులు వ్యాపించే అవకాశం ఉందన్నారు. ప్రతి ఒక్కరూ పరిశుభ్రత పాటించాలని తెలిపారు. అనంతరం విద్యార్థుల చేత ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నాగరవీంద్ర, హెల్త్ ఎడ్యుకేటర్ మల్లికార్జున, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ సులోచన, ఏపీఓ జయంతి పాల్గొన్నారు .

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుందాం

కొత్తపల్లి: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తహసీల్దార్ ఉమారాణి, డిప్యూటీ ఎంపీడీఓ సుబ్బరావు సూచించారు. శనివారం మండల కేంద్రంలో తహసీల్దార్, దుద్యాలలో డిప్యూటీ ఎంపీడీఓ ఆధ్వర్యంలో స్వర్ణాంధ్ర–స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం నిర్వహించారు. పరిశుభ్రతపై ర్యాలీలు, మానవహారం కార్యక్రమాలు నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతిఒక్కరూ పరిసరాల పరిశుభ్రతను పాటించినప్పుడు ఆరోగ్యకరమైన జీవనం గడపవచ్చన్నారు. తడి, పొడి చెత్తలను వేరు చేసి స్వచ్ఛభారత్ కార్మికులకు అందజేయాలన్నారు. ఇళ్ల సమీపంలో నీరు నిలువకుండా, మురికి కుంటలు లేకుండా చూసుకోవాలన్నారు.

ఘనంగా ప్రకాశం పంతులు జయంతి



ప్రకాశం పంతులు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

ఆత్మకూరు: స్వాతంత్ర్య సమరయోధుడు, ఆంధ్రప్రదేశ్ తొలి ముఖ్యమంత్రి, ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశంపతులు జయంతిని శనివారం స్థానిక రైతు సేవా సంఘం కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ మైనార్టీ సెల్ రాష్ట్ర సెక్రటరీ, ఆత్మకూరు రైతు సేవా సంఘం గౌరవ అధ్యక్షులు మోమిన్ మునీర్‌బాషా అధ్యక్షతన టంగుటూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రైతుసేవా సంఘం అధ్యక్షులు బైరాపురం రహంతుల్లా, కృషి పండ్ల తోటల సంఘం అధ్యక్షులు బైరాపురం మహబూబ్‌బాషా, రైతు సంఘం నాయకులు ముసలమడుగు నబిసాహెబ్, టైగర్ బాబు, రాజమద్ గారి ఇబ్రహీం, అమలాపురం షేక్‌నబీసా, కట్టుబడి యూసుఫ్, సుబ్బరాయుడు, శివ, కట్టుబడి జాకీర్, మోమినిస్సు పాల్గొన్నారు.

నాపరాతి గనిలో ట్రాక్టర్ బోల్తా



గనిలో వేలాడుతున్న ట్రాక్టర్



గాయపడిన శ్రీరాములు

అవుకు(కొలిమిగుండ్ల): మండల పరిధిలోని చెర్లోపల్లె సమీపంలో ఉన్న నాపరాతి గనిలో శనివారం ట్రాక్టర్ బోల్తా పడి డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. నాపరాళ్లను లోడ్ చేసేందుకు ట్రాక్టర్ గనిలోకి వెళుతున్న సమయంలో అదుపు తప్పింది. డ్రైవర్ శ్రీరాములు ట్రాక్టర్ నుంచి గనిలోకి కిందకు పడిపోవడంతో రెండు కాళ్లు విరిగి తీవ్రంగా గాయపడ్డాడు. ట్రాక్టర్ ఇంజిన్ భాగం లోతుగా ఉన్న గనిలో వేలాడుతూ ఉండిపోయింది. ప్రమాద సమయంలో డ్రైవర్ మినహా ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. క్షతగాత్రుడిని చికిత్స కోసం ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు.

అంధకారం

- గువ్వలకుంట్లలో నెలరోజులుగా వెలగని వీధి దీపాలు



ఎస్సీ కాలనీలో వెలగని వీధి లైటు

కొత్తపల్లి: మండలంలో గువ్వలకుంట్ల గ్రామస్తులు అంధకారంలో మగ్గుతున్నారు. నూతన విద్యుత్ లైన్ ఏర్పాటు చేసిన విద్యుత్‌శాఖ సిబ్బంది వీధి లైట్లు అమర్చడంలో నిర్లక్ష్యం వహిస్తుండటంతో గ్రామంలో రాత్రి పూట చీకట్లు అలుముకుంటున్నాయి. ఇళ్ల నుంచి బయటకు రావాలన్నా ప్రజలు భయపడుతున్నారు. అసలే వర్షాకాలం కావడంతో పురుగు, పుట్ర భయం వెంటాడుతోందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సమస్యను త్వరగా పరిష్కరించాలని వారు కోరుతున్నారు.